క్లుప్తంగా

ఓటు హక్కును వినియోగించుకోవాలి



మేరా పెహ్లా ఓట్ దేశ్ కేలియేలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ అధికారులు, విద్యార్థులు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో మినిస్ట్రీస్ ఆఫ్ యూత్ ఎఫైర్స్, రీజనల్ డైరెక్టర్ ఆఫ్ ఎన్ఎస్ఎస్ పిలుపు మేరకు మేరా పెహ్లా ఓట్ దేశ్ కేలియే కార్యక్రమానికి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేట్ విద్యావతి మాట్లాడుతూ రానున్న ఎన్నికలలో యువత ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. దేశాన్ని ముందుకు నడిపించే శక్తి ఓటుకు మాత్రమే ఉందని, మానవాళికి సేవ చేసే మంచి నాయకున్ని ఎన్నుకోవాలని సూచించారు. ఓటు ప్రాధాన్యతను తల్లిదండ్రులకు, బంధుమిత్రులకు తెలయజేయాల్సి భాద్యత యువతదేనన్నారు.

టీటీడీ క్రీడా పోటీల్లో టగ్ ఆఫ్ వార్ విజేతలు



విజేతగా నిలిచిన జట్టు

తిరుపతి(అలిపిరి): టీటీడీ ఉద్యోగుల క్రీడాపోటీలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు జరిగిన టగ్ ఆఫ్ వార్ పోటీల్లో టీటీడీ అధికారుల విభాగంలో చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు జట్టు విజేతగా నిలిచింది. సీపీఆర్వో డాక్టర్ టి.రవి జట్టు రన్నరప్‌గా నిలిచింది. 45 ఏళ్ల పైబడిన మహిళల విభాగంలో దామరసెల్వి జట్టు విజయం సాధించగా కుమారిదేవి జట్టు రన్నరప్‌గా నిలిచింది. 45 ఏళ్ల లోపు మహిళల విభాగంలో యశోద జట్టు విజయం సాధించగా జమున జట్టు రన్నరప్‌గా నిలిచింది. 45 ఏళ్ల పైబడిన పురుషుల విభాగంలో రాజేంద్రన్ జట్టు విజయం సాధించగా.. దేవసుందరం జట్టు రన్నరప్‌గా నిలిచింది. 45 ఏళ్ల లోపు పురుషుల టగ్ ఆఫ్ వార్ పోటీల్లో ఎ.మునివెంకటరెడ్డి జట్టు విజయం సాధించగా, ఆర్.బాలాజీ సింగ్ జట్టు రన్నరప్‌గా నిలిచింది.

13 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 13 మందికి లక్షా 30 వేల రూపాయలు జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ శుక్రవారం తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ గిరి తెలిపిన వివరాల మేరకు... తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించగా మద్యం తాగి నిర్లక్ష్యంగా వాహనాలు నడుపుతున్న వారిపై కేసు నమోదు చేశారు. 13 మందిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి జరిమానా విధించారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం

- భక్తులకు మెరుగైన సేవలు అందించాలి
- టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి
- ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు ప్రారంభం



క్రీడాపోటీల ప్రతిజ్ఞ చేస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి తదితరులు

తిరుపతి(అలిపిరి): భగవంతుని సేవలో ఉద్యోగులు క్రీడాస్ఫూర్తితో పనిచేసి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని... క్రీడలతో మానసిక ఒత్తిడి నుంచి దూరంగా ఉండొచ్చని టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కోరారు. ఉద్యోగుల వార్షిక క్రీడా పోటీలు శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలోని పరేడ్ మైదానంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈవో ఏవీ ధర్మారెడ్డి ఉద్యోగులతో క్రీడాప్రతిజ్ఞ చేయించారు. ముందుగా చైర్మన్, ఈవో కలిసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. బెలూన్లు, శాంతి కపోతాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ టీటీడీ ఉద్యోగులకు మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు, క్రీడలపై ఆసక్తిని పెంచేందుకు ఏటా క్రీడాపోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. క్రీడలతో శారీరక దారుఢ్యంతోపాటు పునరుత్తేజం కలుగుతుందని చెప్పారు. ఉద్యోగులకు క్రీడలపై ఉన్న శ్రద్ధను గమనించి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి టీటీడీ రూ.10 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. టీటీడీ సంక్షేమ విభాగం డెప్యూటీ ఈవో స్నేహలత మాట్లాడుతూ ఉద్యోగుల సంక్షేమం, మానసిక వికాసం కోసం 1977 నుంచి ఏటా ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ పోటీల్లో మొదటి స్థానం గెలుచుకున్న వారికి రూ.2 వేలు, రెండో స్థానంలో నిలిచిన వారికి రూ.1800, మూడో స్థానంలో నిలిచినవారికి రూ.1600 విలువగల బ్యాంకు గిఫ్ట్‌కార్డులు బహుమతులుగా అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా చైర్మన్, ఈవో వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభించారు. పరేడ్ మైదానంతోపాటు రిక్రియేషన్ హాల్, ఎస్వీ హైస్కూల్ మైదానం, ఎస్వీ జూనియర్ కళాశాల మైదానం, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల మైదానం, శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో ఉద్యోగులకు క్రీడాపోటీలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్ఓ నరసింహకిషోర్, చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, ముఖ్య గణాంకాధికారి శేషశైలేంద్ర, సీపీఆర్ఓ టి.రవి,



వాలీబాల్ ఆడి క్రీడలను ప్రారంభిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి

వీజీవో బాలిరెడ్డి, టీటీడీ ఉద్యోగుల సంక్షేమ సంఘ అధ్యక్షులు చీర్ల కిరణ్, హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు గంపల వెంకటరమణారెడ్డి, ఐక్యపోరాట కమిటీ కన్వీనర్ జాటోత్ భాస్కర్, గోల్కొండ వెంకటేశన్, ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

భూమన కుటుంబం వెంటే బలిజలంతా...

- భూమన అభినయ్‌కి అండగా నిలబడి.. ఆశీర్వదిద్దాం
- బలిజ కులస్థుల ఆత్మీయ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం

తిరుపతి మంగళం: తిరుపతిలోని బలిజలంతా ఒక్కటై భూమన కుటుంబం వెంటే నిలబడుతామని డిప్యూటీ మేయర్, బలిజ నేత ముద్రనారాయణ తెలిపారు. బలిజ కులస్థులంతా భూమన అభినయ్‌రెడ్డికే మద్దతు ఇస్తామని బలిజల ఆత్మీయ సమావేశంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. తిరుపతిలోని ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో శుక్రవారం బలిజ నాయకులు ముద్ర నారాయణ, నీలం బాలాజీ, బాలిశెట్టి కిషోర్, మద్దాలి శేఖర్ ఆధ్వర్యంలో బలిజల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన భూమన కరుణాకరరెడ్డి, భూమన అభినయ్‌రెడ్డిలపై పూలవర్షం కురిపించి దుశ్శాలువాలు కప్పి, గజమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా ముద్ర నారాయణ మాట్లాడుతూ తిరుపతిలో బలిజల సంక్షేమం కోసం, బలిజల అభ్యున్నతి కోసం కృషి చేసిన కుటుంబం ఒక భూమన కుటుంబం మాత్రమేనని సగర్వంగా చెప్పారు. తిరుపతిలో అత్యున్నత డిప్యూటీ మేయర్ స్థానాన్ని తనకు కల్పించిన గొప్ప మనసున్న నాయకుడు భూమన కరుణాకరరెడ్డి అన్నారు. లీలామహల్ సర్కిల్ మార్గాన్ని శ్రీకృష్ణదేవరాయలు మార్గంగా నామకరణం చేయడం అభినందనీయమన్నారు. అనంతరం నీలం బాలాజీ మాట్లాడుతూ అతి చిన్న వయసులోనే గొప్ప ఆలోచనలతో తిరుపతిని ఎంతో అభివృద్ధి చేసిన ఘనత భూమన అభినయ్‌దేనన్నారు. అభివృద్ధి ప్రధాతగా తిరుపతి ప్రజల గుండెల్లో నిలిచిపోయిన అభినయ్‌కి బలిజల మద్దుతు ఎప్పుడూ ఉంటుందన్నారు. దొరైరాజ్ మాట్లాడుతూ కులాలను అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేసేవాళ్లను టీడీపీలోనే చూశామని, కుల మతాలకు తావు లేకుండా పనిచేసే నాయకులు భూమన కరుణాకర రెడ్డి, భూమన అభినయ్‌రెడ్డిలేనన్నారు. సునీల్‌చక్రవర్తి, బాలిశెట్టి కిషోర్, నూనారు మధుబాల తదితరులు పాల్గొన్నారు.



బలిజల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్, బలిజ నేత ముద్రనారాయణ

కాన్వకేషన్‌కు ఆహ్వానం



సతీష్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న వర్సిటీ అధికారులు

తిరుపతి సిటీ : పద్మావతి మహిళా వర్సిటీలో ఈ నెల 7న జరగనున్న కాన్వకేషన్‌కు హాజరు కావలని డీఆర్‌డీఏ మాజీ చైర్మన్, రక్షణ మంత్రి శాస్త్రీయ సలహాదారు డాక్టర్ జీ.సతీష్‌రెడ్డిని వర్సిటీ వీసీ డీ.భారతి ఆహ్వానించారు. తిరుపతికి విచ్చేసిన ఆయనను శుక్రవారం రిజిస్ట్రార్ రజిని, వర్సిటీ అధికారులతో మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వానం అందించారు.

5 నుంచి పశువిజ్ఞాన ప్రదర్శన

తిరుపతి సిటీ: ఎస్వీ వెటర్నరీ కళాశాలలో ఈనెల 5వ తేదీ నుంచి రెండు రోజులపాటు పశు విజ్ఞాన ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు అసోసియేట్ డీన్ డాక్టర్ పి.జగపతిరామయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు, నగర ప్రజలు వర్సిటీని సందర్శించి పశు వైద్య కళాశాలలో పశువుల వైద్యం, పరిశోధనలు, అనాటమీ, డెయిరీ టెక్నాలజీ, పాథాలజీ మ్యూజియం వంటి వాటిని సందర్శించవచ్చునని తెలిపారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజస్తంభానికి ధ్వజపటం అధిరోహింపజేస్తున్న అర్చక పండితులు



పల్లకిలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తున్న శ్రీసోమస్కంధమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారు

- వేడుకగా శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

తిరుపతి కల్చరల్: శ్రీకపిలేశ్వరస్వామి వారి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఉదయం చేపట్టిన ధ్వజారోహణంతో వేడుకగా ప్రారంభమయ్యాయి. అర్చకుల వేద మంత్రోచ్ఛరణ నడుమ, శంఖానాథా లు, శివనామస్మరణ మధ్య ధ్వజారోహణ ఘట్టం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పంచమూర్తులైన శ్రీసోమస్కంధమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారు, శ్రీవినాయకస్వామి, శ్రీచండికేశ్వరస్వామి, శ్రీవల్లి, దేవ సేన సమేత శ్రీసుబ్రమణ్య స్వామివారి ఉత్సవమూర్తుల సమక్షంలో ఉదయం 7.40 గంటలకు మీన లగ్నంలో నంది చిత్రంతో కూడిన వస్త్రాన్ని ధ్వజపటానికి చుట్టి ధ్వజస్తంభంపైకి అధిరోహింపచేశారు. కంకణభట్టర్ మణివాసన్ గురుకుల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం శాస్త్రోక్తంగా చేపట్టారు.

ఏడాదికోసారి ధ్వజస్తంభానికి విశేష అభిషేకం

ధ్వజారోహణంలో భాగంగా మొదట ధ్వజపటం అధిరోహణ, తర్వాత ధ్వజస్తంభానికి అభిషేకం, బలి నివేదన, దీపారాధన, ఉపచారాలు నిర్వహించారు. ఏడాదికోసారి బ్రహ్మోత్సవాల సందర్భంగా ధ్వజారోహణం రోజున మాత్రమే ధ్వజస్తంభానికి విశేష అభిషేకం చేస్తారు. పెరుగు, చందనం, విభూది, పన్నీరు, పలురకాల పండ్ల రసాలతో వేడుకగా ధ్వజస్తంభానికి అభిషేకం చేశారు. ఏడాదికొకసారి అత్యంత వేడుకగా 10 రోజులపాటు నిర్వహించే శ్రీకపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు విశేష సంఖ్యలో భక్తుజనం విచ్చేసి స్వామివారి కృపకు పాత్రులు కావాలని శ్రీకపిలేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు కంకణభట్టర్ మణివాసన్ గురుకుల్ పిలుపు నిచ్చారు. ధ్వజారోహణం అనంతరం శ్రీసోమస్కంధమూర్తి, శ్రీకామాక్షి అమ్మవారి పల్లకీ ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. పల్లకీపై కొలువై స్వామి, అమ్మవారు పుర



స్వామి వారి హంస వాహన సేవలో భజన, కళా ప్రదర్శన చేస్తున్న కళాకారులు

వీధుల్లో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. ఆలయ డెప్యూ టీ ఈవో జి.దేవేంద్రబాబు, ఏఈవో సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, అర్చకులు స్వామినా థ గురుకుల్, ఉదయ గురుకుల్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, బాలకృష్ణ, భక్తులు పాల్గొన్నారు.

హంస వాహనంపై కపిలేశ్వరస్వామి

శ్రీకపిలేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా మొదటి రోజైన శుక్రవారం రాత్రి హంస వాహనంపై శ్రీకపిలేశ్వరస్వామి ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. రాత్రి 7 నుంచి 9 గంటల వరకు స్వామివారి హంస వాహసన సేవ వేడుకగా సాగింది. గజరాజులు ముందు నడుస్తుండగా కళాబృందాల కోలాటాలు, భజనల నడుమ వాహన సేవ కోలాహలంగా నిర్వహించారు. తొలిరోజైన శుక్రవారం రాత్రి ఎస్వీ సంగీత, నృత్య కళాశాల, ఎస్వీ నాదస్వర, డోలు పాఠశాల ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత, నృత్య ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. కేసన్న, వెంకన్న నాదస్వరంపై, నాగరాజు, చంద్రశేఖర్ డోలుపై అద్భుతంగా లయ విన్యాసం చేశారు. అలాగే కళాశాల అధ్యాపకురాలు వందన శిష్య బృందం ఆలపించిన సంగీత గానామృతం వీనుల విందుగా సాగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉమా ముద్దుబాల పాల్గొన్నారు.

ఆలయాల అర్చకుల జీతాలు పెంపుపై హర్షం

తిరుపతి మంగళం: స్థానిక ఆలయాల్లో అర్చకులుగా పనిచేస్తున్న తమపై ఎవరూ దయ చూపలేదని, అయితే తమ సమస్యలు గుర్తించి జీతాలు పెంచిన టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి దయచూపారని ఆలయాల అర్చకులు అన్నారు. తిరుపతి పద్మావతిపురంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని స్థానిక ఆలయాల అర్చకులు కలిసి జీతాలు పెంపుపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వేదమంత్రాలతో కరుణాకరరెడ్డిని ఆశీర్వదించారు.



టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని వేదమంత్రాలతో ఆశీర్వదిస్తున్న అర్చకులు

క్లుప్తంగా

ఎమ్మెల్యే పెళ్లి కానుక అందజేత



పెళ్లి కానుకను అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాకాల: శ్రీనివాసనగర్‌లో నూతనంగా ఒక్కటి కాబోతున్న వధూవరులకు చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పెళ్లి కానుకను అందజేశారు. శుక్రవారం ఈ కానుకను స్థానిక నాయకుల చేతుల మీదుగా కాబోయే వధూవరులు బాబూప్రసాద్, సత్యలకు బంగారు తాళిబొట్టు, వెండి మెట్టెలు, భాసికాలు, పట్టు బట్టలు, తిరుమల శ్రీవారిప్రసాదం, గ్రీటింగ్ కార్డును అందజేశారు. ఎంపీటీసీ కస్తూరి, శివకుమార్, వెంకటేష్, మోహన్, నంద, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీ క్లినిక్ ప్రారంభం



ఫిజియోథెరపీ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: తుమ్మలగుంట తెలుగుతల్లి సర్కిల్లో ఆర్థశ్రీ ఫిజియోథెరపీ క్లినిక్‌ను తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. గ్రామ స్థాయిలో అత్యాధునిక ఫిజియోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారని డాక్టర్ మీనారెడ్డిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫిజియోథెరపీ క్లినిక్ నిర్వాహకురాలు డాక్టర్ మీనారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్టుకు పాకాల ఉపాధ్యాయుడు

పాకాల: యనమలవారిపల్లి ఎంపీపీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు ఎ.సుబ్రమణ్యం ఆల్ ఇండియా సివిల్ సర్వీస్ షటిల్ బ్యాడ్మింటన్ రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం సుబ్రమణ్యం మాట్లాడుతూ విజయవాడలో జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేశారని పేర్కొన్నారు. పంజాబ్ రాష్ట్రంలోని చండీగఢ్‌లో ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు తెలిపారు. ఎంఈఓ బాబ్జీ, లింగయ్య, పలువురు ఉపాధ్యాయులు సుబ్రమణ్యంను అభినందించారు.

చరిత్రలో నిలిచిపోయే నాయకుడు జగనన్న



వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి



చెవిరెడ్డి లక్ష్మికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

పాకాల: ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయే నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఈ–పాలగుట్టపల్లి పంచాయతీలోని యానాది శేషాపురం, దేవినేనిఇండ్లు, పాలగుట్టపల్లి, లక్ష్మీపురం, సీఎం కొత్తూరు, ఎగువ హరిజనవాడ, దిగువ హరిజనవాడ, వెంకట్రామాపురం, వరదప్పనాయడుపేట గ్రామాల్లో గడపగడపకు మహాపాదయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు చెవిరెడ్డి లక్ష్మికి పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా స్వాగతించారు. మహిళలు మంగళ హారతులు పట్టి, గుమ్మడి కాయలు కొట్టి ఆత్మీయంగా స్వాగతించారు. ఈ సందర్భంగా ఆమె గడపగడపకు తిరిగి ప్రజలతో మమేకమయ్యారు. స్థానిక ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రతీ ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన పథకాలు, ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. పంచాయతీలో నూతనంగా సుమారు రూ.35 లక్షల వ్యయంతో సీసీ రోడ్లు, రూ.60 లక్షలతో డ్రైనేజీలు, ఆర్వో మినరల్ వాటర్ ప్లాంట్లు, రచ్చబండలు, ఇలా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. చంద్రగిరి నియోజకవర్గంలో మన ఎమ్మెల్యే అనేక సేవా కార్యక్రమాలను చేపట్టారని, తన సొంత నిధులతో కరోనాలాంటి కష్టకాలంలో మందులు, కూరగాయలు, పండ్లు, విటమిన్ మాత్రలు, మందులు, శానిటైజర్లతో సహా అందించారని, ప్రజల ఆరోగ్యంగా ఉండాలని తన ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కష్టపడ్డారని తెలిపారు. ఇంకా గ్రామాల్లో ఎక్కడ ఏ సమస్య ఉన్నా వెంటనే తెలపాలని, వాటిని పరిష్కరించేందుకు వెంటనే చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. తండ్రి బాటలో నడుస్తూ, ప్రజల సేవ చేసుకునేందుకు తన తనయుడు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆశీర్వదించాలని, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో చంద్రగిరి వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరి, ప్రార్థించారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుటుంబానికి రుణపడి ఉంటామని, అడగక ముందు అన్ని సహాయాలు చేసి, తమ సంక్షేమం చూసిన ఆయనకు ఎల్లవేళలా అండగా నిలబడుతామని, తుడాచైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరిస్తామని ప్రజలు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ లోకనాథం, జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి, కన్వీనర్ నంగా నరేష్ రెడ్డి, స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లివేడు విక్రమ్‌రెడ్డి, పొలిటికల్ ఇంచార్జ్ పులికేశవమూర్తి రెడ్డి, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ రఘుపతి, డివిజన్ అధ్యక్షుడు కపిలేశ్వర్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి, ఖాజామస్తాన్, పవన్‌కుమార్, సర్పంచులు సిద్ధారెడ్డి, నాని, కళావతి, యువరాజు, ఎంపీటీసీ మల్లికార్జున, శకుంతలమ్మ, చంద్ర, నాగరాజనాయుడు, కేశవులరెడ్డి, రామలింగారెడ్డి, రెడ్డెమ్మ, హసీనా, లక్ష్మీసుధ, హేమంత్‌రెడ్డి, జ్యోతీశ్వర్‌రెడ్డి, సంతోష్ రెడ్డి, సురేంద్ర, శివారెడ్డి, రహీం, వినాయక, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సంక్షేమానికే ప్రజల మద్దతు



ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి, చెవిరెడ్డి ఆకాష్‌రెడ్డి

భాకరాపేట: ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలకు జగనన్న సంక్షేమానికి మద్దతు పలుకుతున్నారని చిన్నగొట్టిగల్లు ఎంపీపీ బాలం యుగంధర్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సోదరుడు చెవిరెడ్డి ఆకాష్ రెడ్డి అన్నారు. శుక్రవారం చట్టీవారిపాళెం పంచాయతీలో పల్లెబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఏగడప కు వెళ్లినా ప్రజలకు జగనన్న అందిస్తున్న సంక్షేమ పథ కాలు తమకు చేరాయని, ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేపట్టిన అభివృద్ధి పనులు తమ గ్రామంలో జరిగాయని సంతోషం వ్యక్తం చేస్తూ స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ దివంగత వైఎస్సార్ తరువాత ప్రజలకు నేరుగా ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను అందించిన నాయకుడు సీఎం జగనన్న ఒక్కరే అన్నారు. గ్రామాలను తుడా నిధుల తో అభివృద్ధి పథంలో నడిపించిన వారు ఎమ్మెల్యే చెవి రెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన మాటను 100 శాతం అమలు చేయడంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వెనకడుగు వేయలేద ని అన్నారు. సంక్షేమాభివృద్ధిని అందించడం ద్వారా ప్రతి కుటుంబం ఆర్థికంగా ప్రగతి సాధించిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు స్వరూప, కొండారెడ్డి, సర్పంచ్ ధనలక్ష్మీ, ఎంపీటీసీ సరస్వతి, డివిజన్ పార్టీ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి, మహేంద్రరెడ్డి, మనోహర్, శంకర్‌రెడ్డి, రఘునాథరెడ్డి, లోకనాథరెడ్డి, సిద్ధరామయ్య, మనోహర్‌రెడ్డి, మునికృష్ణ, రఘునాథ్ పాల్గొన్నారు.

డయాలసిస్ రోగికి పింఛను పంపిణీ



పింఛను అందజేస్తున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులు

చంద్రగిరి: నెల రోజుల క్రితం పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న డయాలసిస్ రోగికి శుక్రవారం అధికారులు పింఛను అందజేశారు. ఐతేపల్లి పంచాయతీకి చెందిన ఖాదర్‌బాషా కిడ్నీ సంబంధిత వ్యాధితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాడు. స్థానిక సర్పంచ్ ఫాజిలా ద్వారా తుడా చైర్మన్, చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనలతో, అధికారులు ఖాదర్ బాషాకు పింఛను మంజూరు చేశారు. శుక్రవారం సర్పంచ్‌తోపాటు పంచాయతీ కార్యదర్శి చంద్రబాబు ఖాదర్‌బాషాకు రూ.10వేల పింఛనును అందజేశారు.

ప్రతి ఇంటా జగనన్న సంక్షేమ వెలుగులు



చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డిని కొత్తశానంబట్లలో గజమాలతో సత్కరించి, స్వాగతం పలుకుతున్న స్థానిక ప్రజలు

- శానంబట్లలో చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డికి అపూర్వ స్వాగతం

చంద్రగిరి: ప్రతి ఇంటా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో లబ్ధి.... చెవిరెడ్డి చేసిన మేలు ఎప్పటికీ మరచిపోలేం... జగనన్నే ఎప్పటికీ మా సీఎం ... చెవిరెడ్డి మోహిత్‌రెడ్డే మా ఎమ్మెల్యే అంటూ శానంబట్ల గ్రామస్తులు యువ నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి హామీ ఇచ్చారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ చిల్లకూరి యుగంధర్‌రెడ్డిలతో కలసి కొత్తశానంబట్ల, దళితవాడ, పాత శానంబట్ల, అరుంధతీవాడ, శివగిరి, కట్టమీద ఇండ్లు గ్రామాల్లో ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటా మహిళలు పెద్ద ఎత్తున మంగళ హారతులిచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఘనంగా స్వాగతం పలికి పూల వర్షం కురిపించారు. అనంతరం యువ నాయకుడు హర్షిత్‌రెడ్డి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను ఇంటింటికీ వెళ్లి వివరించారు. ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి గత 14 సంవత్సరాలుగా ప్రతి ఇంటిని వ్యక్తిగతంగా ఆదుకుంటున్నారని ఆయన కుమారుడిని ఆదరించడం మా బాధ్యత అని గ్రామస్తులు తెలియజేశారు. ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపుతున్నామని హర్షిత్‌రెడ్డి తెలిపారు.

9 కోట్లతో శానంబట్ల అభివృద్ధి

చంద్రగిరి మండలం శానంబట్ల పంచాయతీలోని గ్రామాలలో తొమ్మిది కోట్ల రూపాయలతో అభివృద్ధి చేశామని యువనాయకుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి వెల్లడించారు. సచివాలయ భవనం, రైతు భరోసా భవనం, విలేజ్ హెల్త్ క్లినిక్, సీసీ రోడ్డు, మురుగుకాల్వలు, గ్రావెల్ రోడ్లు నిర్మాణాలు చేశామన్నారు. అభివృద్ధి కళ్లకు కనబడుతోందని, తన అన్నయ్య చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఆదరించాలని ఆయన కోరారు. ఎమ్మెల్యేగా అన్నయ్యని గెలిపిస్తే మరింత గ్రామం అభివృద్ధి జరుగుతుందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ అరగొండ వనజ చంద్రశేఖర్ రెడ్డి, సర్పంచ్ యశోద శంకర్ యాదవ్, ఏఎంసీ చైర్మన్ కొటాల చంద్రశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పసల నాగరాజు, కుప్పిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు భారతి, రాంభద్రారెడ్డి, నరసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

గోవిందాశ్రిత గోకుల బృందా...



మాడవీధులలో ఊరేగుతూ చిన్నశేషవాహనంపై కొలువుదీరిన స్వామివారు

చంద్రగిరి: శ్రీనివాస మంగాపురంలోని శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం ఉదయం పంచ శిరస్సుల చిన్న శేష వాహనంపై మురళీకృష్ణుడిగా, రాత్రి హంస వాహనంపై సరస్వతీదేవిగా తిరువీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. వేకువజామున సుప్రభాత సేవతో శ్రీస్వామివారిని మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగ శ్రవణం, అర్జితం, మొదటి గంట, శాత్తుమొర నిర్వహించారు. ఉదయం 8గంటలకు శ్రీస్వామివారిని విశేష పుష్పాలంకరణలు, స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా మురళీకృష్ణుడు అవతారంలో అలంకరించి ఐదు తలల చిన్న శేషుడిపై ఆశీనులు చేశారు. అనంతరం భక్తజన బృందాల చెక్క భజనలు, కోలాటాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నయనానందకరంగా జరిగింది. అశేష సంఖ్యలో భక్తులు దర్శించి తరించారు. మధ్యాహ్నం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం ఉభయదేవేరులతో స్వామివారు ఉయ్యాల(ఊంజల్) సేవలో సేదతీరారు. రాత్రి 7 గంటలకు వీణధరించి సరస్వతీ రూపంలో హంస వాహనంపై ఆశీనులై స్వామివా రు తిరు మాడవీధుల్లో విహరించారు. ఊరేగింపు ముందు కేరళ వాయిద్యం భక్తులను ఆకట్టుకుంది. హిందూ ధర్మప్రచార పరిషత్, దాస సాహిత్య ప్రాజెక్టు, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ స్పెషల్ గ్రేడ్ డెప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్‌లు చెంగల్రాయులు, వెంకటస్వామి, ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు

మూడో రోజు శనివారం ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపు పందిరిపై విహరిస్తూ శ్రీస్వామివారు భక్తులను అనుగ్రహించనున్నారు.